క్లుప్తంగా

పిల్లలకు నైతిక విలువలు నేర్పించాలి



స్వామివారికి హారతి ఇస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న తనం నుంచే నైతిక విలువలు నేర్పించాలని ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమం జరిగింది. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. సంధ్యా హారతి, తులసి హారతి, రాజభోగ నివేదన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు భగవద్గీతను పఠనం, శ్రవణం చేయాలన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణానికి భగవద్గీత మార్గదర్శనం చేస్తుందన్నారు. అనంతరం హరే కృష్ణ హరే రామ నామ జపం సామూహికంగా పఠించారు.

కవిత్వం వస్తువు వైవిధ్యంగా ఉండాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: కవిత్వం వస్తువు వైవిధ్యంగా ఉండాలని ప్రముఖ కవి అనిల్ డానీ అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో రాయలసీమ ప్రచురణలు ఆధ్వర్యంలో తెలుగు వెంకటేష్ రచించిన 'రెయిన్ కేఫ్' పుస్తకావిష్కరణ జరిగింది. విజయవాడకు చెందిన ప్రముఖ కవి బండ్ల మాధవరావు ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనిల్ డానీ మాట్లాడుతూ వాన కన్నీళ్లు తాగి బతుకుతున్నామని, మనిషి జీవనాన్ని వానతో ముడిపెట్టి చెప్పటం గొప్ప కవిత్వ పదచిత్రానికి నిదర్శనమన్నారు. కవి కవిత్వం ద్వారా జీవన తాత్వికతను చెప్పారన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీ ప్రింటర్స్ అధినేత విశ్వేశ్వర రావు, కథా రచయిత మారుతి పౌరోహిత్యం మాట్లాడారు. కార్యక్రమంలో కవులు రచయితలు మహమ్మద్ మియ్యా, ఇనాయతుల్లా, పాణి, సారథి, కల్యాణ దుర్గం స్వర్ణలత, అజీజ్, జంధ్యాల రఘుబాబు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక



సంజీవయ్య నగర్ యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోట్ల హర్ష, సతీష్

గూడూరు: పట్టణంలోని దామోదరం సంజీవయ్య నగర్‌కు చెందిన యువకులు ఆదివారం కర్నూలులో వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. కౌన్సిలర్ కలాం, కో ఆప్షన్ సభ్యుడు షబీర్, షాషా వలి, రషీద్ ఆధ్వర్యంలో యువకులు ఉపేంద్ర, విష్ణు, సందీప్, జిప్సన్, చిన్న, దుర్గ, కార్తీక్, రానా, అజయ్, సాయి, నాగరాజు తదితరులకు సతీష్, కోట్ల హర్ష పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

సీపీఎం అభ్యర్థి ప్రచారం

కర్నూలు(సెంట్రల్): పాణ్యం ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ దిశ, దశను మారుస్తానని డి.గౌస్‌దేశాయ్ హామీ ఇచ్చారు. ఆదివా రం నగరంలోని షరీన్‌నగర్, రాఘవేంద్రనగర్, బద్రీనాథ్ నగర్‌లలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. తనను కాంగ్రెస్, సీపీఐ పార్టీలు బలపరుస్తున్నాయని, ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పేదల పక్షపాతి జగన్





18వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, వైఎస్సార్‌సీపీలో చేరిన జొహరాపురం వాసులతో ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ

- ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టండి
- ఎన్నికల ప్రచారంలో జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజినల్ కో-ఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ గెలుపుకోసం ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలన్నారు. ఆదివారం రాత్రి 18 వ వార్డు జొహరాపురంలో స్థానిక కార్పొరేటర్ పల్లవి ఆధ్వర్యంలో విస్తృతంగా తిరిగారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాట్లాడుతూ ఇప్పటికే అన్ని సర్వేలు మళ్లీ వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి వస్తుందని చెప్పాయన్నారు. ఐదేళ్ల పాటు అన్ని వర్గాలకు న్యాయం చేసిన పార్టీ తమదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వసనీయత కలిగిన జగనన్న వైపు ప్రజలందరూ ఉన్నారన్నారు. వరుసగా మూడో సారి కర్నూలులో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామన్నారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ మాట్లాడుతూ పేదలను అదుకున్న జగనన్నకు ప్రజలు మద్దతుగా నిలవాలన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇంటింటికీ సంక్షేమం అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున ప్రతి ఒక్కరూ కష్టపడి పార్టీని గెలిపించుకోవాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు గడ్డం రామక్రిష్ణ, కార్పొరేటర్లు శ్రీనివాసరావు, షేక్ యూనుస్ బాషా, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో చేరిక

స్థానిక జొహరాపురానికి చెందిన పలువురు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వారందరికీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి మాట్లాడుతూ జగనన్న మంచి పనులు చూసి అందరూ పార్టీలో చేరుతున్నారన్నారు. పేద వాడి జీవితానికి జగనన్న భరోసా ఇచ్చారన్నారు. వచ్చే నెల 13వ తేదీన జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి పార్టీని గెలిపించాలన్నారు.

గెలిపించండి..అండగా ఉంటా

- టీవీ టెక్నీషియన్ల సమావేశంలో వైఎస్సార్‌సీపీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్

కర్నూలు (టౌన్) : తనను ఎన్నికల్లో గెలిపిస్తే.. అన్ని విధాలుగా అండగా ఉంటానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ నగర టీవీ టెక్నీషియన్లకు స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో వారితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం సామాన్య, మధ్య తరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ఐదేళ్ల పాలనపై ప్రతి కుటుంబం సంతోషం వ్యక్తం చేస్తుందన్నారు. అయితే, అధికారం కోసం తెలుగుదేశం పార్టీ ఇతర పార్టీలతో జతకలిసి మాయమాటలు చెబుతుందన్నారు. బాబు మోసపు మాటలు నమ్మితే ఇబ్బందులు తప్పవన్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంటు డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్ ఎస్వీమోహన్ రెడ్డి మాట్లాడుతూ విద్యావంతుడు, పరిపాలన దక్షతలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఇంతియాజ్ మన కర్నూలు నగర ఎమ్మెల్యే అభ్యర్థిగా రావడం మంచి పరిణామమన్నారు. మనందరం కలిసికట్టుగా ఆయనను గెలిపించుకుందామన్నారు. కర్నూలు నగర టీవీ టెక్నీషియన్ల అసోసియేషన్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న ఇంతియాజ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. అందరం కలిసి కట్టుగా ఆయన గెలుపునకు కృషి చేస్తామన్నారు.



సమావేశానికి హాజరైన నగరంలోని టీవీ టెక్నీషియన్లు

ఉత్తమ పౌరులుగా ఎదగాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: విద్యార్థులు ఉత్తమ సమాజ పౌరులుగా ఎదగాలని పలువురు వక్తలు, ధార్మిక సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారపేట కేశవ మెమోరియల్ పాఠశాలలో ఆదివారం గుమ్మితం తాండ, కన్నమడకల, డి.బెళగల్, కుంకనూరులలోని బాల వికాస పాఠశాలల జిల్లా వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న బాల వికాస పాఠశాలల ద్వారా గ్రామాల్లో చైతన్యం తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకున్నాయి. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.డి.వి.జోగయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కర్నూలు ఇస్కాన్ మందిరం ప్రవచకులు రఘునందన సేవక ప్రభు, లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం, బొమ్మిరెడ్డి పల్లె శ్రీ భీమ లింగేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్త పూడూరు లక్ష్మీరెడ్డి, వెల్దుర్తి హనుమాన్ జంక్షన్ వ్యవస్థాపకులు రామాంజనేయులు స్వామి సందేశమిచ్చారు. సమరసత ఫౌండేషన్ ప్రతినిధులు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షరీన్‌నగర్‌లో వైద్య శిబిరం

కల్లూరు: ప్రజా సేవ చేయాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని ఎస్ఎంబీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ షేక్ మహబూబ్ బాషా అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ షరీన్‌నగర్‌లో అమీలియా ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో అమీలియా ఆస్పత్రి ఎండీ డాక్టర్ లక్ష్మీప్రసాద్, ఏపీఎస్పీ బెటాలియన్ మైనార్టీ డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా, ముస్లిం మైనార్టీ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర నాయకుడు సోయ బుద్దిన్ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

24న బండలాగుడు పోటీలు

మద్దికెర: ఎం.అగ్రహారం గ్రామంలో అవధూత పక్కీరప్ప స్వామి రథోత్సవం సందర్భంగా 24వ తేదీ ఉదయం 8 గంటలకు రాష్ట్రస్థాయి దేశం, కిలారి ఎద్దుల రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ విజయుడు, గ్రామస్తులు ఆదివారం తెలిపారు. విజేతలకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులు అందించ నున్నట్లు చె ప్పారు. ఆసక్తిగల వృషభాల యజమానులు 97010 90928, 90520 32913 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.

నేడు క్రిష్ణదొడ్డిలో ప్రభోత్సవం

సి.బెళగల్: క్రిష్ణదొడ్డి గ్రామంలో కొండపై వెలసిన శ్రీకోన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రభోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి నుంచి ప్రత్యేక పూజలు జరగనున్నాయి. మంగళవారం తెల్లవారుజామున ప్రభను లాగేందుకు సిద్ధం చేశారు. అదే విధంగా ఆదివారం అర్ధరాత్రి అనంతరం నిర్వహించే గరుడవాహన సేవకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొండపై ఉన్న స్వామివారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అలాగే కొండపై నుంచి శ్రీవారి ఉత్సవ విగ్రహాన్ని కొండ దిగువకు చేర్చారు.

సీ క్యాంప్ సర్కిల్‌లో తాటిముంజల విక్రయ దృశ్యం (ఇన్‌సెట్) తాటిముంజలు



ఆహా..భలే మజా!

- తాటి ముంజలకు గిరాకీ

కర్నూలు (న్యూటౌన్): వేసవి వచ్చిందంటే చాలు తెల్లతెల్లటి తాటి ముంజలు ముత్యపు చిప్పల్లా మెరిసిపోతూ మనకు నోరూరిస్తాయి. కల్తీలేని, స్వచ్ఛమైన ఈ తాటి ముంజలు వేసవి తాపాన్ని తీర్చడంతో పాటు అధిక పోషకాలు కలిగి ఉండడంతో కొనుగోలు చేసేందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డోన్, చిట్యాల, కొయిలకొండ, తాటిమాన్ కొత్తూరు, కప్పట్రాళ్ల, కంబాలపాడులో అత్యధికంగా తాటి చెట్లు ఉన్నాయి. రైతులు చెట్ల నుంచి వీటిని కోసి వ్యయ, ప్రయాసలతో ఆటోల్లో కర్నూలుకు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. తాటి ముంజలు డజన్ రూ.100కి, అరడజన్ రూ.50కి విక్రయిస్తున్నారు. వేసవిలో తాటిముంజలను పంచదారతో కలిపి తింటే ఆ రుచి అమోఘమని పెద్దలు చెబుతున్నారు. నగరంలోని సీ క్యాంప్ సర్కిల్ సమీపంలో, రైతు బజార్ బయట, వాల్‌మార్ట్ ఎదురుగా, ఆర్‌ఎస్ రోడ్డు సర్కిల్ సమీపంలో రైతులు ఉదయం నుంచి అమ్మకాలను ప్రారంభించగా మధ్యాహ్నానికే చల్లటి ఐస్‌క్రీమ్ లాగా తాటి ముంజలు అమ్ముడుపోతున్నాయి.



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

టీడీపీకి ఓటమి తప్పదు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఎన్నికల్లో ఎన్ని జిమ్మిక్కులు చేసినా టీడీపీకి ఓటమి తప్పదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధిలోని పందిపాడు, ఆశ్వర్థపురం, బొల్లవరం, రెమడూరు గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యేకు ఆయా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కాటసాని అవ్వాతాతలు, మహిళలు, ప్రజలను అప్యాయంగా పలకరిస్తూ ఐదేళ్లలో చేసిన మంచిని వివరించారు. ప్రజలు మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి అన్ని సేవలను స్థానికంగానే అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. గత టీడీపీ పాలనకు, ఈ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించాలని కోరారు. అర్హత ప్రమాణికంగా పథకాలను అందిస్తూ నేరుగా లబ్ధిదారుల ఖాతాలో నగదు జమ చేసి ఎలాంటి అవినీతి లేకుండా చేశామన్నారు. గత టీడీపీ పాలనలో పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ సిఫార్సులతో పాటు నాయకుల అండదండలు ఉండాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం అందిస్తున్న నవరత్నాల పథకాలు కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ రెడ్డి, కార్పొరేటర్ నారాయణరెడ్డి, నాయకులు సత్యంరెడ్డి, భీమేష్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం శెట్టి, చాంద్ బాషా, మస్తాన్‌నాయుడు, రెమడూరు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా భగవాన్ మహవీర్ జయంతి



మహవీరుని చిత్ర పటంతో ఊరేగింపు నిర్వహిస్తున్న జైనులు

కర్నూలు కల్చరల్: జైన 24వ తీర్థంకరుడు భగవాన్ మహవీర్ 2623వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ జైన్ శ్వేతాంబర్ మూర్తి పూజక్ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓల్డ్ సిటీలో ఉన్న జైన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తాంబర్ నిర్వహించారు. మహవీర్ మూర్తికి అభిషేకం, అర్చన, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు జరిగాయి. జైన్ ఆలయం నుంచి మహవీర్ చౌక్ వరకు మహవీరుని చిత్ర పటంతో జైనులు భారీ ఊరేగింపు నిర్వహించారు. జైన్ మ హిళలు మహవీర్‌ను ధ్యానిస్తూ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గోశాలలో గోపూజ, గోవులకు గ్రాసం పంపి ణీ చేశారు. ఇళ్లలో తయారు చేసిన రొట్టెలను ఆహారంగా గోవులకు తినిపించారు. పుల్లూరులోని మహవీర్ ధామ్‌లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరిగాయి. భక్తి సంధ్యా కార్యక్రమాలు నిర్వహించారు. చల్లని తీపి పానీయాలు, అన్నదాన కార్యక్రమాలు చేశారు. జైన్ సంఘం ప్రతినిధులు జయంతి లాల్, రమేష్, శుసీల్, రాజు, అశోక్, చంపా లాల్ , రంజిత్, చందు, పాల్గొన్నారు.